క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని రాయ్‌నగర్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి. హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హరిజనవాడ, ఉపాధ్యాయనగర్, చర్చిరోడ్డు, రీచ్ స్కూల్ రోడ్డు, రాయ్‌నగర్, రామ్‌నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియా, తహసీల్దారు కార్యాలయం ఏరియా, గాంధీబొమ్మ సెంటర్, బుద్ధవరం రోడ్డు, గొడపేట, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, వీనస్ బజార్, చెంచులకాలనీ, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పోరంకి పాఠశాల తనిఖీ



సాక్షి ఎఫెక్ట్

పెనమలూరు: పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ శేషగిరిరావు శనివారం తనిఖీ చేశారు. సాక్షిలో శనివారం పాఠశాల దుస్థితిపై వచ్చిన 'కనీస వసతులు కరువు' కథనంపై ఎంఈఓ స్పందించారు. పాఠశాలలో పరిస్థితులు వెంటనే మెరుగుపర్చాలని, పంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. చేతులు కడుక్కోవడానికి పంపులు కొన్ని ఏర్పాటు చేశారు. అయితే మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయడానికి సిబ్బంది రావడం లేదని ఎంఈఓ దృష్టికి హెచ్ఎం సుమలత తీసుకువచ్చారు. సమస్యలు వెంటనే పరిష్కారమయ్యే విధంగా చూడాలని ఎంఈఓ సూచించారు.

బ్యానర్ల తొలగింపు

ఉయ్యూరు: ఎన్నికల కోడ్ అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 'యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన' శీర్షికన సాక్షిలో శనివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ యంత్రాంగం ఉయ్యూరు పట్టణంలో బ్యానర్ల తొలగింపు చేపట్టారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు ఆదేశాలతో బ్యానర్లు, ప్రధాన సెంటరులో ఉన్న భారీ కటౌట్‌ను తొలగించారు. ఎన్నికల కోడ్ అమలులో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని కమిషనర్ స్పష్టంచేశారు. సిబ్బంది ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని ఆదేశించారు.

అభయాంజనేయుడికి గద బహూకరణ



ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో వేంచేసి ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అమృత మెస్, క్యాటరర్స్ అధినేత మేరుగుమాల కుటుంబరావు రూ. 40 వేలు విలువ గల వెండి గదను స్వామివారికి బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరీదు శ్రీనివాసరావు, వీరంకి శివనాగేశ్వరరావు, యార్లగడ్డ ఈశ్వరరావు, ఆరేపల్లి నాగరాజు, హరిబాబు పాల్గొని దాత కుటుంబరావును సత్కరించారు.

ఉపసర్పంచ్ పదవికి రాజీనామా

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు ఉపసర్పంచ్ ఒంగూరు పుణ్యవతి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నగ్గిస్‌కు అందజేశారు. పంచాయతీ ఎన్నికల్లో 3వ వార్డు సభ్యురాలుగా గెలుపొందిన పుణ్యవతి అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ సూచన మేరకు పాలకవర్గ సభ్యులు ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. వ్యక్తిగత కారణాలతో పుణ్యవతి ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేసి 3వ వార్డు సభ్యురాలుగా కొనసాగనున్నారు.

విద్యుత్ మోటార్ల చోరీలు

- వరుస చోరీలతో లబోదిబోమంటున్న రైతులు
- వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, రాగి తీగల చౌర్యం
- ఒకే రాత్రిలో 25 మోటార్ల వైర్లు చోరీ



వ్యవసాయ బోరు వద్ద దుండగులు కత్తిరించిన విద్యుత్ వైర్లు చూపుతున్న రైతులు (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిన్న మొన్నటి వరకు ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడ్డ అన్నదాతలకు ఇప్పుడు కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. ఇటీవల బాపులపాడు మండలంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగల చోరీలు, వ్యవసాయ విద్యుత్ మోటారు వైర్ల చోరీలు జోరందుకున్నాయి. తాజాగా శోభనాద్రిపురంలో ఒక రాత్రిలోనే 25 వ్యవసాయ విద్యుత్ మోటార్లు వద్ద దుంగడులు వైర్లు దొంగిలించారు. ఈ తరహా చోరీలు పెరిగిపోవడంతో రైతాంగం లబోదిబోమంటున్నారు. బాపులపాడు మండలంలోని హనుమాన్‌జంక్షన్ సెక్షన్ పరిధిలో 2 వేలు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీరవల్లి సెక్షన్ పరిధిలో మరో 2,500 కనెక్షన్లు ఉన్నాయి. సగటున ఏడాదికి మండలంలో 150కి పైగా వ్యవసాయ విద్యుత్ రాగితీగల చోరీలు జరుగుతున్నాయి.

నష్టపోతున్న రైతులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలుకొట్టి రాగితీగలను దొంగిలించే ఘటనలు పోలీసు ఫిర్యాదుల వరకు వెళ్తున్నా, విద్యుత్ మోటార్ల కేబుళ్ల చోరీ వ్యవహారంలో చాలా వరకు రైతులు ఫిర్యాదులు చేసేందుకు వెనకాడుతున్నారు. విద్యుత్ మీటర్ల నుంచి వ్యవసాయ మోటార్లకు సరఫరా అందించే వైర్లు కత్తించుకుపోతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. అర్ధరాత్రి వేళల్లో దొంగలు పొలాల్లోకి చొరబడి విద్యుత్ తీగలను తొలగించి, దానిలోని రాగి అపహరిస్తున్నారు. ఈ తరహా చోరీల్లో రైతుకు కనీసం రూ.10 వేలు వరకు నష్టం వాటిల్లుతుంది. రాత్రివేళ చీకట్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు కట్ చేయడం ప్రాణాంతకమని తెలిసినా దుండగులు వెనక్కి తగ్గడం లేదు.



దుండగులు కత్తిరించిన విద్యుత్ మోటార్ల వైర్లు (ఫైల్)

అదును చూసి అపహరణ

గత ఏడాది మండలంలోని బొమ్ములూరులో వ్యవసాయ విద్యుత్ మోటారు వైర్లు దొంగిలించేందుకు వెళ్లిన దుండగుడు అర్ధరాత్రి వేళ బోరుబావిలో పడిన సంఘటన చోటు చేసుకుంది. దుండగుడు తప్పించుకునేందుకు అవకాశం లేకపోవడంతో చివరికి రైతులకు చిక్కాడు. విద్యుత్ సరఫరా లేని సమయంలోనూ, రాత్రి వేళల్లో రైతులు పంట పొలాల్లో లేనప్పుడు అధికంగా చోరీలకు పాల్పడుతున్నారు. మండలంలోని కొయ్యూరు, కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల, మల్లవల్లి, రంగన్నగూడెం, వేలేరు, కోడూరుపాడు, శోభనాద్రిపురం, వీరవల్లి గ్రామాల్లో అధికంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగలను దొంగిలించడం, విద్యుత్ వైర్లు అపహరించడం అధికంగా జరుగుతున్నాయి.

ఐదుసార్లు చోరీ



ఇప్పటికి మా పామాయిల్ తోటల్లో ఐదుసార్లు విద్యుత్ మోటార్ల కేబుళ్లు చోరీ జరిగాయి. తరచూ చోరీలు జరగడంతో విద్యుత్ వైర్ల కొనుగోలు భారంగా మారుతోంది. వరుస చోరీ ఘటనలపై పోలీసులు చర్యలు తీసుకోవాలి. దుండగుల ఆగడాలను అరికట్టాలి.

– జోజిబాబు, శోభనాద్రిపురం

ఇబ్బందులు పడుతున్నాం



వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు ధ్వంసం చేసి రాగి తీగలను అపహరించడం విపరీతంగా జరుగుతున్నాయి. మా పొలంలో కూడా ఐదుసార్లు దొంగిలించారు. దీంతో రాత్రివేళల్లో పొలాల్లోకి వచ్చి చూసుకుని వెళ్తున్నాం. అయినప్పటికీ రైతులు లేని సమయాల్లో దొంగతనాలు చేస్తున్నారు.

– మహేష్, కోడూరుపాడు

సిబ్బంది సేవలు అభినందనీయం

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించిన జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు

కోనేరుసెంటర్: ప్రజల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడిన సిబ్బంది సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు పేర్కొన్నారు. జిల్లాలోని ఉయ్యూరు, పెనమలూరు పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుళ్లు బి.మొహమ్మద్‌సర్దార్, బి.ఏడుకొండలును ఎస్పీ తన కార్యాలయంలో కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి అత్యున్నత సేవలను అందించినవారికి పోలీసుశాఖ ఎల్లపుడూ అండగా ఉంటుందని తెలిపారు. పోలీసు ఉద్యోగం పొందిన నాటి నుంచి కుటుంబం కంటే పోలీసుశాఖకే అధిక ప్రాధాన్యతను ఇచ్చి అహర్నిశలు శ్రమించినవారి సేవలను పోలీసుశాఖ మరచిపోదన్నారు. ఉద్యోగ విరమణ కాలానికి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటం అదృష్టంగా భావించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ సిబ్బందికి పోలీసుశాఖ తరపున ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా నిస్సంకోశంగా అధికారులను కలవ వచ్చని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది కుటుంబ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కౌలురైతుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం

కంకిపాడు: కౌలురైతుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కౌలురైతులకు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. వ్యవసాయంలో కీలకంగా ఉన్న కౌలురైతులను విస్మరించడం సరికాదన్నారు. కౌలు రైతాంగానికి ప్రయోజనాలను కల్పించడం, సాగులో చేయూత అందించడంలో తొలి నుంచి కేంద్రం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకానికి కేవలం రూ. 86 వేలు కోట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. గ్రామీణాభివృద్ధిపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కేంద్ర వైఖరిని నిరసిస్తూ ఈనెల 5వ తేదీన అన్ని గ్రామాల్లో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యాన పంటల్లో యాజమాన్య చర్యలు కీలకం



గొడవర్రులో మునగ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి

కంకిపాడు: ఉద్యాన పంటల్లో యాజమాన్య చర్యలు కీలకమని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో సాగులో ఉన్న పలు ఉద్యానవన పంటలను ఉద్యానశాఖ అధికారి చందు జోసఫ్ సుందరంతో కలిసి శనివారం ఆమె సందర్శించారు. అరటి, మునగ, పామాయిల్ తోటలను సందర్శించి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలను వివరించారు. అరటిలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఉన్నట్లు గుర్తించారు. తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు/క్లోరోథోలోల్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఆయిల్ ఫామ్ తోటల్లో ఎర్రముక్కు పురుగు, కొమ్ము పురుగు లేత తోటల్లో కనిపిస్తే లింగాకర్షక బుట్టలను ఎకరాకు నాలుగు చొప్పున ఏర్పాటు చేయాలని సూచించారు. మునగ తోటల్లో కాయ తొలుచు ఈగ, వేరు కుళ్లుతో సమస్య అధికంగా ఉంటుందని తెలిపారు. కాయ తొలుచు పురుగు ఈగ నివారణకు లీటరు నీటికి పాసలోన్ రెండు మిల్లీలీటర్లు, వేరుకుళ్లు నివారణకు మొక్కల మొదళ్ల వద్ద ఒక శాతం బోర్డు మిశ్రమాన్ని పోసి తడి ఇవ్వాలని సూచించారు.

ఆటల పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



సత్తా చాటిన విద్యార్థులతో హెచ్ఎం సుధారాణి తదితరులు

కంకిపాడు: బాలికల ఆటల పోటీల్లో కంకిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం జీబీకే సుధారాణి శనివారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఉయ్యూరు మండలం ఆకునూరు జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో పెనమలూరు నియోజకవర్గ స్థాయి 84వ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలు శనివారం నిర్వహించారని చెప్పారు. సాఫ్ట్‌బాల్, కబడ్డీ పోటీల్లో సీనియర్స్ కేటగిరీలో ప్రథమ స్థానం, జూనియర్స్ విభాగం సాఫ్ట్‌బాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. తమ విద్యార్థులు జిల్లా స్థాయి గ్రిగ్ మెమోరియల్‌కు ఎంపికయ్యారని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు లకనం దుర్గాప్రసాద్‌ను ఎంఈఓ కేవీ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సచివాలయ ఉద్యోగులు వితంతు, వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు అందజేశారు. పింఛన్లు ఇంటింటికీ తిరిగి అందజేయాల్సి ఉన్నా పలు గ్రామాల్లో ఉద్యోగులు తాము ఉన్న చోటుకే లబ్ధిదారులను రప్పించుకుని అందజేశారు. సాంకేతిక సమస్య ఫలితంగా సర్వర్లు మొరాయించడంతో పంపిణీలో ఇబ్బందులు తలెత్తాయి.

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో శనివారం సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సాయంత్రానికి దాదాపు 90 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్, ఎంపీడీవో ప్రణవి పింఛన్ల పంపిణీ పర్యవేక్షించారు.

ఉంగుటూరు: మండలంలో 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జోగేశ్వరరావు తెలిపారు. సచివాలయ సిబ్బంది శనివారం ఉదయమే లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారని పేర్కొన్నారు. అయితే పలు గ్రామాల్లో పింఛన్ పంపిణీ సమయంలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు.

టౌన్ ప్లానింగ్ విభాగం ప్రక్షాళన



తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులను మార్పులు చేర్పులు చేస్తూ కమిషనర్ భవానీప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. అక్రమ లేఅవుట్లు, అనుమతులు లేకుండా భవనాల నిర్మాణం, సామాన్య ప్రజలకు ప్లాన్లు జారీ చేయాలంటే సిబ్బంది చేతివాటంపై సాక్షిలో వరుస కథనాలు రావడంతో టౌన్ ప్లానింగ్ విభాగంలో ప్రక్షాళన చేశారు. గతంలో యనమలకుదురు, కానూరుకు టీపీఎస్‌గా పని చేసిన కె.శ్రీనివాసరావును బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో నందిగామ నుంచి వచ్చిన టీపీఎస్ టి.శైలజకు అక్రమాలకు అడ్డాగా ఉన్న యనమలకుదురు, తాడిగడప ప్రాంతాలు కేటాయించారు. అదేవిధంగా కానూరు, పోరంకి ప్రాంతాలకు అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా(ఏసీపీ) ఎం.రంగప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన గత కొద్ది నెలలుగా సెలవులో ఉన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాల కారణంగా ఆయన సెలవు పెట్టారని గుసగుసలు వినబడుతున్నాయి. సెలవులో ఉన్న వ్యక్తికి అతి ముఖ్యమైన కానూరు అప్పగించడంపై చర్చ జరుగుతోంది.

ఇప్పటికైనా అవినీతి కంపు వదిలేనా..?

తాడిగడప మున్సిపాలిటీలో ఇప్పటికైనా అవినీతి కంపు వదులుతుందా అని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. అనుమతిలేని కట్టడాలను ప్రోత్సహించడం, సామాన్య ప్రజలను కాసుల కోసం వేధించడం వంటి వాటిని అధికారులు ఇకనైనా మానతారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ లేఅవుట్లను ప్రోత్సహించడం వంటి పనులు ఆపాలని మున్సిపాలిటీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా యనమలకుదురు, తాడిగడపకు వచ్చిన టీపీఎస్ ఏమేరకు నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తారనేది వేచి చూడాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో కొత్తగా వచ్చిన టీపీఎస్ పాత్ర కత్తిమీద సాములా ఉంటుందని స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికే తాడిగడప మున్సిపాలిటీలో అక్రమాల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతోంది. ఇక సెలవులో ఉన్న ఏసీపీ ఎం.రంగప్రసాద్ విధులకు హాజవుతారో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా టౌన్‌ప్లానింగ్ విభాగం పని తీరుపైనే అందరి కళ్లు ఉన్నాయి.

11 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

విజయవాడరూరల్: ఈ నెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు విజయవాడ రూరల్ మండలంలో 11 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు, సహాయ ఎన్నికల అధికారి బి.సుగుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో గన్నవరం నియోజకవర్గం గ్రామాల్లో 4,880, మైలవరం నియోజకవర్గం గ్రామాల్లో 3,120 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. రామవరప్పాడు గ్రామంలో 3, ప్రసాదంపాడులో 1, నున్నలో 2, గొల్లపూడిలో 5 చొప్పున ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

నున్న- గుడివాడ ట్రాన్స్‌మిషన్ లైన్ల మరమ్మతులు

నున్న(విజయవాడరూరల్): ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ నున్న-గుడివాడ ట్రాన్స్‌మిషన్ విద్యుత్ లైన్ల మరమ్మతులు శనివారం (ఫిబ్రవరి 1) నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు జరుగుతాయని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.కోటేశ్వరరావు, ఓఅండ్ఎం నున్న ఒక ప్రకటనలో తెలిపారు. 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రం గుడివాడలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాని తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుంది. కానీ దీని వల్ల సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అయితే అత్యవసర పరిస్థితి ఉత్పన్నం అయితే 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, కేవీ చిగురుకోటల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కృష్ణా మిల్క్ యూనియన్‌కు పాడిరైతులే వెన్నెముక



కోడూరుపాడులో పాడిరైతులను సత్కరిస్తున్న యూనియన్ చైర్మన్ చలసాని

హనుమాన్‌జంక్షన్ రూరల్: సహకార పాడి పరిశ్రమ రంగంలో అగ్రగామిగా నిలిచిన కృష్ణా మిల్క్ యూనియన్‌కు పాడిరైతులే వెన్నెముక అని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బాపులపాడు మండలం కోడూరుపాడులోని పాల కేంద్రంలో కృష్ణామిల్క్ యూనియన్ వజ్రోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లగా కృష్ణామిల్క్ యూనియన్ పాడిరైతుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని పేర్కొన్నారు. కోడూరుపాడు పాలకేంద్రం స్థాపించిన నాటి నుంచి సభ్యులుగా ఉన్న పాడిరైతులను దుశ్శాలువాలతో చైర్మన్ చలసాని సత్కరించారు. కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షుడు కళ్లే వెంకటేశ్వరరావు, క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు పాల్గొన్నారు.



కంకిపాడు బైపాస్ వెంబడి నాట్లు వేస్తున్న కూలీలు



పునాదిపాడులో దమ్ము చేస్తున్న ట్రాక్టరు



దావులూరులో వరి నారు తీస్తున్న కూలీలు

ముమ్మరంగా రబీ పనులు

రబీ వరి సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో వరి సాగుకు అధికారికంగా అనుమతి లేకపోయినా బోర్ల సదుపాయం ఉన్న రైతులు వరి సాగు చేపట్టారు. నారుమడులు సిద్ధమవుతుండటంతో వరి నాట్లు వేగవంతం చేశారు. పొలాలను దమ్ము చేసి నాట్లు వేస్తున్నారు. వరి సాగు పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమై ఉన్నారు.

– కంకిపాడు

జాతీయ స్థాయిలో సత్తాచాటిన పీవీపీ విద్యార్థిని



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థిని పొట్లూరి హనీషా మోదిత సత్యశ్రీ జాతీయ స్థాయిలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో సత్తాచాటింది. ఇటీవల జరిగిన వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2025 జాతీయ యువజన ఉత్సవాల్లో పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగించింది. దేశవ్యాప్తంగా 30 లక్షల మంది విద్యార్థులు అభ్యర్థిత్వాన్ని పంపగా వారిలో 1,500 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో పొట్లూరి హనీషా మోదిత సత్యశ్రీ ఉత్తమ ప్రతిభ చాటి ఐదవ స్థానంలో నిలిచింది. ఏపీ నుంచి మొదటి స్థానం పొందింది. ఈ సందర్భంగా హనీషాను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు, ఈసీఈ ప్రొఫెసర్ అన్నే అశోక్‌బాబు, అధ్యాపకులు, సభ విద్యార్థులు అభినందించారు.

నేడు చేనేతల సన్నాహక సమావేశం

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున విద్యా సంస్థల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చేనేతల బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు బందారు ఆనంద్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సమన్యాయం కోసం, చేనేత కళ పరిరక్షణ, వృత్తి మనుగడ, చేనేత కళాకారుల సంక్షేమం ప్రధాన ఎజెండాగా సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో చేనేత ఫెడరేషన్ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.